క్లుప్తంగా

అన్నవితరణ



అన్నవితరణ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీటీఆర్ఐ: స్థానిక కంబాల చెరువు పార్క్ దగ్గర వున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త బండారు మధుసూదనరావు అన్నారు. శనివారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇకపై ప్రతి శనివారం జరుగుతుందన్నారు. ప్రధాన అర్చకుడు మహేంద్రాడ శ్రీనివాసాచార్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

జాబ్‌మేళా



ఇంటర్వ్యూకు హాజరైన యువతి

సీటీఆర్ఐ: వికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. శనివారం వికాస ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాకి 35 మంది హాజరయ్యారు. వారిలో నాగు ఇన్ఫోటెక్‌కు ముగ్గురు, ఆదిత్య ఇంజినీరింగ్ సర్వీసెస్‌కు ముగ్గురు, డిక్సన్‌కు తొమ్మిది మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో వికాస మేనేజర్ సత్యనారాయణ, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నో బ్యాగ్‌డే



విద్యార్థులతో కృత్యాలు చేయిస్తున్న హెచ్‌ఎం మంగారాణి

కంబాలచెరువు: విద్యార్థుల్లో సృజనకు పదును పెట్టేలా ప్రతి నెలా మొదటి, మూడవ శనివారాల్లో నో బ్యాగ్‌డే నిర్వహిస్తున్నామని నాగరాజా మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం మోటూరి మంగారాణి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఒకటో తరగతి విద్యార్థులు గణితంలో క్రాఫ్ట్‌వర్క్ చేశారన్నారు. ఈ విద్యా సంవత్సరం నో బ్యాగ్‌డేని కేవలం 1, 2 తరగతులకు పరిమితం చేశారని, గతంలో 8వ తరగతి వరకూ ఉండేదన్నారు. ఆ రోజుల్లో విద్యార్థులతో అకడమిక్ కేలండర్‌లో నిర్దేశించిన కృత్యాలు చేయిస్తున్నామన్నారు.

3వ వార్డు ఏకగ్రీవం

కడియం: జేగురుపాడు పంచాయతీ 3వ వార్డు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ వార్డు నుంచి కలవ కుమారి ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో ఆమెను ఏకగ్రీవంగా నిర్ణయించి శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రం అందజేశారు. కుమారి భర్త ఇదే వార్డు నుంచి సభ్యుడు. ఆయన ఏడాది క్రితం మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులనే ఆ వార్డు నుంచి నిలపాలన్న ఉద్దేశంతో ఇతరులెవ్వరూ నామినేషన్లు వేయలేదు.

డీసీసీబీ చైర్మన్ పరామర్శ

కడియం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు శనివారం కడియపులంకలో ఈలి బాబ్జీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాబ్జీ ఇటీవలే గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు బోడపాటి సత్తిబాబు, ఆకుల వెంకన్న ఉన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా

కంబాలచెరువు: ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. బదిలీ, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో విద్యాశాఖ నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్యాప్టో చైర్మన్ పి.జయకర్, సభ్యులు డేనియల్ బాబు మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 23న ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపడతామన్నారు.

గైట్‌లో వర్క్‌షాపు

రాజానగరం: చిన్న అంకురాల కనీస ఆచరణీయ ఉత్పత్తి అనే అంశంపై స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో శనివారం ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా మెడ్‌టెక్ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ నందా పోశి మాట్లాడుతూ విషయ పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన యువతకు ఫార్మసీ రంగం మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు తోడ్పడుతుందన్నారు. ఫార్మసీ విద్యను అభ్యసించిన వారు సొంతంగా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని, మరెందరికో ఉపాధి చూపించవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామచంద్రన్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా ఆవ రోడ్డు

- రెండు నెలల్లో పనులు పూర్తి
- ఎంపీ భరత్ రామ్



మొక్కలు నాటి నీరుపోస్తున్న ఎంపీ భరత్ రామ్, సిటీ కో ఆర్డినేటర్ గుడూరి శ్రీనివాస్, చిత్రంలో కమిషనర్ దినేష్ కుమార్



సూర్యారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీ భరత్ రామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలో నూతనంగా నిర్మించిన ఆవ 100 అడుగుల రహదారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం ప్రధాని మోదీ నా మట్టి - నా దేశం (మేరా మిట్టీ-మేరా దేశ్) కార్యక్రమం నిర్వహించారు. ఆవ వంద అడుగుల రోడ్డుకు ఇరువైపులా, డివైడర్‌లోనూ సుమారు 500లకు పైగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ చేపట్టింది. ముఖ్యఅతిథులుగా ఎంపీ భరత్ రామ్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్, నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ హాజరై మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు.

రూ.6 కోట్లతో రహదారి అభివృద్ధి

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ మోరంపూడి జంక్షన్ సమీపంలో ఆవ వంద అడుగుల రోడ్డును రూ.6 కోట్లతో నిర్మించామన్నారు. ఈ రోడ్డు మోరంపూడి జంక్షన్ వద్ద నేషనల్ హైవే నుంచి ఈస్టర్న్ రైల్వేస్టేషన్ రోడ్డుకు వెళుతుందని, అలాగే ఎస్వీజీ మార్కెట్‌కు, తిలక్ రోడ్డు నుంచి సత్యనారాయణ పురం మీదుగా ఈ రోడ్డును కలపబోతున్నామన్నారు. రెండు నెలల్లో అందమైన రహదారిగా, నగరంలోనే రోల్ మోడల్ రోడ్డుగా ఆవిష్కృతం కాబోతోందన్నారు. దీనికి ఇరువైపులా ఎంతో ఉపయుక్తమైన మొక్కలు, డివైడర్‌లో చెర్రీ బ్లోసమ్ ట్రీలు పెంచబోతున్నట్టు తెలిపారు.

ఢిల్లీకి పవిత్రమైన మట్టి

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. హర్ ఘర్ తిరంగా, ఆవ రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం, స్వాతంత్ర్య సమరయోధులకు, ఆర్మీ జవాన్లను సత్కరించడం తదితర వాటిని ఇప్పటి వరకూ నిర్వహించామన్నారు. ఈనెల 30న ఢిల్లీ కర్తవ్య పథ్‌లో నిర్వహించే కార్యక్రమానికి రాజమహేంద్రవరం నుంచి ఒక కలశంలో ఇక్కడి పవిత్ర మట్టిని తీసుకు వెళ్లనున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపీ భరత్ రామ్, కమిషనర్ దినేష్ కుమార్ నేతృత్వంలో నగరం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతోందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సత్యవేణి, ఉద్యానవనశాఖ ఏడీ దేవానంద్, వైఎస్సార్ సీపీ నాయకులు మింది నాగేంద్ర, పాలిక శ్రీను, పీతా రామకృష్ణ, ఎన్వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, టీకే విశ్వేశ్వర రెడ్డి, సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి, మట్టా వీరబాబు గౌడ్, రాజమౌళి, దుంగా సురేష్, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.

మీరేమి చేశారో చెప్పండి..

నగరంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి సహించలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారని ఎంపీ భరత్ రామ్ అన్నారు. నగరంలో జరిగిన నా మట్టి - నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. గత దశాబ్దన్నర కాలంలో మీరేమి చేశారో చెప్పగలరా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. చిన్నపాటి వర్షానికే నగరంలో రహదారులు వర్షానికి మునిగిపోతున్నాయని ప్రతిపక్షంలో కొందరు గొంతు చించుకుంటున్నారన్నారు. వారందర్నీ ఒకటే అడుగుతున్నా..గత నలభై సంవత్సరాల పాటు పాలించారు కదా, అప్పుడేమీ చేశారని ప్రశ్నించారు. గతంలో వర్షాలు వస్తే ఆర్యాపురం రహదారులపై బోట్లపై ప్రయాణించేవారని, రౌతు సూర్యప్రకాశరావు ఎమ్మెల్యే అయ్యాక ఏబీ నాగేశ్వరరావు పార్కు తీసుకొచ్చి సమస్యకు చెక్ పెట్టారని తెలిపారు. అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్న నిధులన్నీ కార్పొరేషన్‌వే, అయితే ఏంటని ఎంపీ భరత్ ప్రశ్నించారు. గతంలో మేయర్ హోదాలో ఉన్న టీడీపీ నాయకులు అప్పుడు మున్సిపల్ నిధులతో ఎందుకు నగరాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. ప్రతి పైసా నగరాభివృద్ధికే వెచ్చించాం, నగరాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దుతాం అని స్పష్టం చేశారు.

ఎంపీ భరత్‌రామ్‌కు వినతి

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలకసంస్థలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఇంజినీరింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు విన్నవించారు. శనివారం ఆవ వంద అడుగుల రోడ్డులో నామట్టి - నాదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీని యూనియన్ నాయకులు ఎస్.ఏసుబాబు, బి.యోషయారాజు, సి.ప్రసాద్, పి.బాల భవానీ కుమార్ కలిశారు. వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్టు వర్కర్లుగా నగరపాలకసంస్థలో పనిచేస్తున్నామన్నారు. 2020లో తమను ఆప్కాస్‌లో చేర్చడం జరిగిందని, తమకు రూ.13,084 జీతం వస్తుందని, ప్రభుత్వం అందజేస్తున్న నవరత్నాలు పథకాలు వర్తించడం లేదన్నారు.

పరామర్శ

పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కదలి వెంకటేశ్వరరావును ఎంపీ మార్గాని భరత్ రామ్, పలువురు పార్టీ నేతలు శనివారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు తండ్రి, ఆలమూరు మండలం సూర్యారావు పేట మాజీ సర్పంచ్ కదలి సూర్యారావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన చిత్ర పటానికి ఎంపీ భరత్‌రామ్ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఆయన వెంట సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్, గౌడ, శెట్టిబలిజ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనివాస్ ఉన్నారు.

చంద్రబాబు మాటలపై ప్రజలకు నమ్మకం లేదు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలను ప్రజలు నమ్మడం లేదని ఎంపీ భరత్ రామ్ అన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు తూర్పు, కోనసీమ జిల్లాలో పర్యటించి, రైతాంగానికి అంత చేస్తా, ఇంత చేస్తానని మాయ మాటలు చెబుతున్నారన్నారు. అప్పుడు వ్యవసాయం దండగన్నారని, రైతులకు ఉచిత విద్యుత్ ప్రకటిస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవచ్చని ఎగతాళి చేశారన్నారు. రైతులు ఆందోళన చేస్తే బషీర్‌బాగ్‌లో పోలీసులతో కాల్పులు జరిపించారన్నారు. పద్నాలుగేళ్లు సీఎంగా పనిచేసిన ఆయన ఏమి భరోసా ఇవ్వగలిగారని ప్రశ్నించారు. సీఎం జగన్ ఈ నాలుగున్నరేళ్లలో రైతు సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు, రూ.వేల కోట్లు వెచ్చించారన్నారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ అజెండా జగన్‌ను టార్గెట్ చేయడమేనన్నారు.

ప్రతి ఇంటికీ జగనన్న సంక్షేమం

- సిటీ కో ఆర్డినేటర్ గుడూరి శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..



మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ గుడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గుడూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక 49వ డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు నేతృత్వంలో సుబ్బారావు నగర్ క్వారీ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ఆ ప్రాంతంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన పథకాల లబ్ధిని వారికి వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు చెప్పిన విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. పలు రేషన్ కార్డు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన వెంట రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, చవ్వాకుల సుబ్రహ్మణ్యం, ఎస్‌కే ఖాన్, సచివాలయ అడ్మిన్లు జయలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ధవళేశ్వరంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీఎన్జీవో నాయకులు

ప్రకాశం నగర్: ఉద్యోగుల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి ఏపీఎన్జీవో మహాసభలు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో జరగబోయే ఏపీఎన్జీవో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శనివారం ప్రకాశం నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభలకు వెళ్లే ఉద్యోగులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సానుకూలంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్ కుమార్, వేణుమాధవరావు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ధవళేశ్వరం: విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే ఏపీఎన్జీవో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ధవళేశ్వరం యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బిలి శ్రీనివాసరావు, ఎస్.జై కుమార్ పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా శనివారం ధవళేశ్వరంలోని పలు రాష్ట్ర ప్రభుత్వ శాఖ కార్యాలయాలను సందర్శించి, ఉద్యోగులకు మహాసభల ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సమస్యల పరిష్కారానికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ నెల 21 ఉదయం 5 గంటలకు ధవళేశ్వరం ఏపీ ఎన్జీవో హోం నుంచి బస్సు, కారులు బయలుదేరతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాలిక రాజబాబు, కోశాధికారి కేఎస్ గౌరీశంకర్, సహాధ్యక్షుడు బి.లక్ష్మణుడు, పీఎస్ శేషుకుమార్, ఎస్.సత్తిరాజు, సయ్యద్ బాజీ, సతీష్ కుమార్, శ్రీనివాసరాజు, ఆదిత్య సోమేశ్వర్, ఏవీవీ రామారావు, వాసుదేవి పాల్గొన్నారు.

బరియల్ గ్రౌండ్ రక్షణకు పటిష్ట ప్రణాళిక



కాతేరు బరియల్ గ్రౌండ్‌లో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ ఆరిఫ్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని ముస్లిం బరియల్ గ్రౌండ్ శాశ్వత పరిరక్షణ కోసం పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తామని వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సూచన మేరకు జిల్లా వక్ఫ్ బోర్డ్ కమిటీతో పాటు స్థానికులు, స్థానిక మసీదు పెద్దలు, ఇతర పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ కాతేరు ముస్లిం బరియల్ గ్రౌండ్ ఆక్రమణలకు గురవుతుందని కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. తమ పరిశీలనలో ఇక్కడ ఎటువంటి ఆక్రమణ జరగలేదన్నారు. త్వరలోనే కబరిస్తాన్ ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇతర సౌకర్యాలను కూడా కల్పించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి గత ప్రభుత్వం చిన్న ప్రయత్నం కూడా చేయలేదన్నారు. ఈ రోజు స్థలాన్ని చదును చేస్తుంటే కబ్జాకు గురైందని దుష్ప్రచారం చేయడం అనైతికమన్నారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలూ తీసుకుంటున్నారన్నారు. గతంలో ఇదే స్థలంలో ముస్లింల మనోభావాలకు విలువ ఇవ్వకుండా అన్న క్యాంటీన్ నిర్మించేందుకు బలవంతంగా స్థలాన్ని కబ్జా చేసి, పునాదులు సైతం వేశారని, ఆనాడు ముస్లింలు నోరెత్తకుండా వారిని భయభ్రాంతులకు చేసి వారిని ఆందోళనకు గురి చేశారన్నారు. ఆ స్థలంలోనే రాబోయే రోజుల్లో ఒక మంచి మసీదు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కాతేరు సొసైటీ అధ్యక్షుడు ఆచంట కల్యాణ్, నూర్ బాషా పెద్దలు షేక్ సలీం, షేక్ మీరా, బడే ఖాన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షబ్బర్ బాషా, స్థానిక నాయకులు షేక్ నిజాం, షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేయాలి



ఆనం కళాకేంద్రంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఓటర్ల జాబితా పరిశీలనను సోమవారానికి పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సహాయ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ అధికారులతో శనివారం స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే వెంటనే పూర్తి చేసి, అర్హులైన ఓటర్లనందరినీ జాబితాలో చేర్చాలన్నారు. బూత్ లెవెల్ అధికారులది ఓటర్ల జాబితా తయారీలో కీలక పాత్ర అన్నారు. ఫారం 6, 7, 8 ల ద్వారా చేసే చర్యలన్నీ పారదర్శకంగా పూర్తి చేసి దరఖాస్తుల డిజిటలైజేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. 17 ఏళ్ల దాటి జనవరి, 2024 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకునేవారిని గుర్తించి వారికి 18 సంవత్సరాలు నిండగానే ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకే డోరు నంబర్‌లో పదిమంది, అంతకన్నా ఎక్కువ ఉన్న ఓటర్ల విషయంలో ఇటీవల ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. సమావేశంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించాలి

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం నగరపాలకసంస్థ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలువల్లో సిల్ట్‌ను తొలగించి మురుగునీటి పారుదలకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముంపు ప్రభావమున్న రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టాయిలెట్ రిపైర్లు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, తడి, పొడి చెత్త నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో 78 వేల ఓట్లు నగర ప్రజల ద్వారా నమోదు అయ్యాయని, ఉత్తమ ర్యాంక్ సాధనకు సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇంకా పెంచాలన్నారు. సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

రోడ్లపై నివసించేవారికి ఓటుహక్కు

రోడ్లపై నివసిస్తున్న వారికి కూడా ఓటు హక్కు కల్పించాలని బూత్ లెవెల్ ఆఫీసర్లను కమిషనరు కె.దినేష్ కుమార్ ఆదేశించారు. అలాంటి వారికి ఓటు హక్కు కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న బృందాల పనితీరును శనివారం రాత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్లు, ఇతర ప్రధాన కూడళ్లలో ఫుట్‌పాత్‌లపై నిద్రించే వారి వివరాలు సేకరించాలన్నారు. సచివాలయ సంక్షేమ కార్యదర్శులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో కూడిన ఏడు బృందాలను నియమించి ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇప్పటి వరకూ ఈ సర్వేలో 300 మందిని గుర్తించడం జరిగిందని, వీరి వివరాలు పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎంసత్యవేణి, సెక్రటరీ ఎస్.సత్యవతి, సిటీ మిషన్ మేనేజర్ రవిశంకర్ పాల్గొన్నారు.

పోలీసులు చిత్రహింసలు పెట్టారంటూ ఆరోపణ

కంబాచెరువు: చేయని నేరానికి పోలీసులు తనను చిత్రహింసలకు గురి చేశారని చాగల్లు మండలం కుంకుడుపల్లెకు చెందిన వడ్డి వెంకటప్రసాద్ ఆరోపించాడు. ఈ నేపథ్యంలో బొల్లినేని ఆసుపత్రిలో మూడు రోజులుగా చికిత్స పొంది బయటకు వచ్చిన వెంకటప్రసాద్ శనివారం మీడియాతో మాట్లాడాడు. వివాహిత అదృశ్యం కేసులో కడియం పోలీసులు తనను తీసుకువచ్చి ఇష్టారాజ్యంగా కొట్టారన్నారు. దాహం అని అడిగితే మూత్రం తాగమని అంటూ ఎస్సై శివాజీ తనను ముఖంపై తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. దీంతో తన కంటి చూపు సరిగా కనిపించడంలేదన్నారు. దీనిపై రాజీకి రావాలని పోలీసులు తనను ఇబ్బంది పెట్టారని, దళిత వ్యక్తినైన నేను న్యాయం కావాలని పోరాటం చేస్తున్నానని అతను తెలిపాడు. దీనిపై వెంకటప్రసాద్ కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

ఆరోపణల్లో వాస్తవం లేదు : పోలీసులు

వడ్డి వెంకటప్రసాద్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. అతడిని విచారిస్తున్న సమయంలో ఆయాసం వస్తోందని చెప్పాడన్నారు. దంతో అతడి వెంట వచ్చిన వారితో బొల్లినేని ఆసుపత్రికి తరలించామన్నారు.అంతే తప్ప అతడు చెబుతున్నట్లు మూత్రం తాగమని అనడం, తీవ్రంగా కొట్టడం ఏమీ లేవని పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

ధవళేశ్వరం: సున్నంబట్టీ వీధికి చెందిన మెరుగు సంపూర్ణ అనే యువతి అదృశ్యమైంది. సంఘటనకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంపూర్ణ ధవళేశ్వరం మార్కెట్‌లో కిరాణా షాపులో పనిచేస్తుంది. ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి వెళుతుండేది. శనివారం ఉదయం కిరాణా షాపుకు వెళ్లిన సంపూర్ణ భోజనానికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో శనివారం రాత్రి ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి మేధ ఉత్సవాలు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ 15, 16వ తేదీల్లో మేధ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి సుబ్బరాజు శనివారం ఆవిష్కరించారు. ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే ఈ సాంకేతిక ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలవారు సెప్టెంబరు 10వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

పార్కింగ్‌తో ఇబ్బందులు

మధురపూడి: కోరుకొండలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రిజిస్ట్రేషన్ కోసం వస్తున్న వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైనే నిలుపుతున్నారు. అటుగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీతానగరం మండలంలోని పలు గ్రామాలతో పాటు, నరసింహ స్వామి దేవస్థానానికి, కోటికేశవరం గ్రామాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలలు నేరాలు చేయకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: బాలలు నేరాలు చేయకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ గంధం సునీత అన్నారు. ఆంధ్రప్రదేశ్ జువెనైల్ జస్టిస్ కమిటీ ఆదేశాలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థలో శనివారం జువెనైల్ జస్టిస్‌పై ప్రధాన స్టేక్ హోల్డర్స్‌తో జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోని పాఠ్యాంశాలలో చేయాల్సిన మార్పులను తెలిపారు. చట్టంతో విబేధించిన బాలలతో చాలా సున్నితంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ఎలాంటి న్యాయ సందేహాలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థని సంప్రదించాలని కోరారు. అనంతరం వచ్చేనెల 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై పోలీస్ అధికారులతో మాట్లాడారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



శ్రీరామపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- పథకాలతో అందరికీ ప్రయోజనం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని శ్రీరామపురంలో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం పరంగా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన ప్రయోజనాలను బుక్‌లెట్ల ద్వారా వివరించారు. ముందుగా శ్రీరామపురం వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

రూ. 2.37 కోట్లతో అభివృద్ధి పనులు

గ్రామంలో గడచిన నాలుగున్నరేళ్లలో రూ.2.37 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. గత ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వంలో చూస్తే కేవలం రూ.20 లక్షలు మాత్రమే అభివృద్ధికి కేటాయించారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామంలోని 4,943 మందికి రూ. 1,71,84,410 మేరకు ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, బోయిడి సుబ్రహ్మణ్యం, చప్పిడి బ్రహ్మాజీ, కోటి బ్రహ్మాజీ, సంగుల సత్తిబాబు పాల్గొన్నారు.